కథ

ఉమెన్స్ కాలేజీలో ఇంగ్లీష్ లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తున్న ఊర్మిళ అందంగా, హుందాగా వుంటుంది. ముప్పయ్యో పడిలో పడుతున్నా పాతికేళ్ళ అమ్మాయిలా చురుకుగా, ఉత్సాహంగా కన్పిస్తుంది.

# వలపు వీచిక

ముగ్గురన్నదమ్ముల తరువాత ముచ్చటగా పుట్టిన ఆడపిల్ల కనుక అల్లారు ముద్దుగా, అపరంజి బొమ్మలా పెరిగింది. 'ముదితల్ నేర్వగరాని విద్యగలదే ముద్దార నేర్పించినన్' అన్నట్లు మామూలు చదువుతోపాటుగా సంగీతం, నృత్యం, చిత్రలేఖనం ఇత్యాది కళలలో కూడా మంచి ప్రావీణ్యాన్ని సంపాదించింది ఊర్మిళ.

ఇంటి దగ్గర ఈవినింగ్ స్కూల్ నడుపుతూ కొంత మంది పిల్లలకు సంగీతం, నృత్యం నేర్పుతోంది. ఆమె వేసిన బొమ్మలు కొన్ని ప్రముఖ పత్రికలలో అత్యంత ఆకర్షణీయంగా, కళాత్మకంగా కన్పిస్తూంటాయి.

బంధుమిత్రులలోనూ, కాలేజీలోను కూడా ఒక ప్రత్యేక మహిళగా ఆమెకో మంచి గుర్తింపు వుంది.

అంతా బాగానే వుంది, అయితే ఒక్కటే చింత ఆమె తల్లిదండ్రులకు! పెళ్ళనే మాట ఎత్తనివ్వదు! ముగ్గురన్నలకు పెళ్ళిళ్ళై ఉద్యోగరీత్యా వేరే వేరే ఊళ్లలో వుంటున్నారు. వాళ్ళు పని గట్టుకుని వచ్చి చెవినిల్లు కట్టుకుని చెప్తారు పెళ్లిచేసుకొమ్మని. "కేవలం ఈ విషయం మాట్లాడడానికే అయితే మీరు మళ్ళీ మళ్ళీ ఇక్కడికి రావద్దు. నా జీవితం గురించి నాకు కొన్ని ఆలోచనలున్నాయి. వాటికి భిన్నంగా నేను నడుచుకోలేను" అని మొహమాటం లేకుండా ఆమె చెప్పింది విని, నాలుగు చీవాట్లు వేసి కోపంగా వెళుతూంటారు వాళ్ళు.

"ఒక్కగానొక్క ఆడపిల్లని గారాబం చేసి పెంచారు. మాట వినకుండా చేసుకున్నారు. చదువుకోగానే సరా, కాస్త బుద్ధీ జ్ఞానం ఉండక్కర్లా అయినా ఇదేం విడ్డూరం! పెళ్లీ పెటాకులూ వద్దంటుంది"

"అమ్మా నాన్న అండ చూసుకొని ఆడుతోంది. ఎల్లకాలమూ ఉంటారా వాళ్ళు ఈవిడగారికి తోడు నీడగా. ఒంటిపిల్లి రాకాసిలా పడుండాలనుకుంటోందేమో ముందు ముందు బాగా తెలుస్తుంది, చూసే దిక్కు లేక..." అంటూ వదినెలు కారాలూ మిరియాలు నూరి, అత్త మామలమీద, ఆడపడుచు మీద అక్కసంతా తీర్చుకుని వెళతారు.

తుపాను వెలిసినంత ప్రశాంతంగా ఉంటుంది వాళ్ళంతా వెళ్ళగానే ఊర్మిళకి.

ఆరోజు ఆదివారం. బ్రేక్‌ఫాస్ట్ చేసి మరునటి రోజు చెప్పాల్సిన లెసన్ ఏదో ప్రిపేరవుతూ కూర్చుంది ఊర్మిళ. తొమ్మిది గంటల వేళ వచ్చాడతను.

"నమస్తే మేడమ్! నేనీమధ్యనే కలకత్తా నుంచి ట్రాన్స్‌ఫరై ఇక్కడి ఆంధ్రా బ్యాంక్‌కు ఆఫీసర్‌గా వచ్చాను. పేరు కౌశిక్. నాకు సంగీతమంటే ప్రాణం. మా మదర్, ఫాదర్ తెలుగువాళ్ళే. ఉద్యోగరీత్యా అక్కడ సెటిలయ్యారు. నేను బెంగాలీ, హిందీ, ఇంగ్లీష్, తెలుగు భాషలలో మాట్లాడగలను" అంటూ తొట్రుపాటుతో ఏదేదో మాట్లాడుతూ తనను పరిచయం చేసుకుంటూన్న అతన్ని గంభీరంగా చూస్తూ "ఇంతకీ మీరొచ్చిన పని..." అడిగింది ఊర్మిళ.

"మా మదర్ తన చైల్డ్‌హుడ్‌లో సంగీతం నేర్చుకుంది. పదిహేనేళ్ళ వయసులో పెళ్ళై కాపురానికి వచ్చాక, అత్తవారింట్లో తన పాటకు ఆదరణ లేక మూగవోయిన వేణువులా అయింది అమ్మ పరిస్థితి! నాన్నకి తాగుడు, పేకాట ఉంటే చాలు... కళలంటే ఆయనకస్సలు ఆసక్తి, అభిరుచి ఉండేవి కావు. దాంతో మా అమ్మ చాలా డిప్రెస్ అయిపోయింది. నాకిద్దరు సిస్టర్స్, ఒక బ్రదర్ వున్నారండీ. నేనే చివరి వాణ్ణి. హార్ట్ ఎటాక్‌తో నాన్న పోయాక అమ్మ అక్కడా, అక్కడా ఉద్యోగాలు చేసుకుంటున్న మా నలుగురు తోబుట్టువుల దగ్గరా ఒక్కొక్కరి వద్ద నాలుగు నెలల చొప్పున ఉంటూ వచ్చేది. ఆ నాలుగు నెలలు కూడా ఆవిడ ఎక్కడ వుంటే అక్కడ, ఆ ఊరి దేవాలయాలలో సాంస్కృతిక సమావేశాలలో ఆవిడ గాత్రకచేరీ ఏర్పాటు చేయించుకునేది. నాన్న బతికున్నప్పుడు అమ్మలో నిద్రాణమై ఉన్న ఆ కళ ఆ విధంగా బయటికి వచ్చి పలువురి ప్రశంసలకు పాత్రమౌతున్నందుకు మాకందరికీ చాలా ఆనందంగా వుండేది.

అమ్మ పాట అత్యంత మధురంగా వుండేది. ఆ పాట సర్వాన్నీ మైమరపింపచేసి, ఏదో ఓ దివ్య అలౌకికానుభూతిలో ఓలలాడింపచేసేది. ఆ గాన సరస్వతి కడుపున పుట్టి సంగీతం నేర్చుకోలేకపోయాననే చింత నన్నెంతగానో బాధపెడుతూ వుంటుంది. తను చనిపోయే ముందు అమ్మ 'నీ గొంతు బావుంటుంది నాన్నా, ఎక్కడైనా మంచి సంగీత విద్వాంసుల దగ్గర అభ్యాసం చెయ్యి' అంటూ వుండేది. ఇన్నాళ్ళూ ఏదో పాడుకుంటూండటమేగాని గురుముఖతః నేర్చింది లేదు. మీ గాత్రం విన్నాను. పిల్లలు, పెద్దలు వచ్చి నేర్చుకోవడం గమనిస్తూన్నాను. నాకూ మీ శిష్యరికం చేయాలని వుంది" అంటూ చిరునవ్వుతో చూశాడు కౌశిక్.

మొదట్లో అతని సుదీర్ఘ ప్రసంగానికి ఆమెకి కొంచెం విసుగనిపించినా, తల్లిపట్ల అతను చూపిస్తూన్న అభిమానాన్ని, మాట్లాడేటప్పుడు ముఖంలో కనబరుస్తూన్న హావభావాల్ని గమనించి, సంస్కారవంతమైన అతని సంభాషణా తీరుకు స్పందనగా "అలాగే నేర్చుకుందురుగాని, మీకు బాగా వచ్చిన పాటేదైనా పాడి వినిపిస్తారా?" అంది ఊర్మిళ.

పాడమనగానే అంబరాన్ని చుంబించినంత ఆనందం కలిగిందతనిలో.

"ప్రియే చారుశీలే..." జయదేవుని అష్టపది అద్భుతంగా ఆలపించాడు.

ఇంకొకటి పాడమందామె.

"రాధికా... కృష్ణా! రాధికా... తవ విరహే కేశవా" తన్మయత్వంతో పాడి వినిపించాడు.

తృప్తిగా, సంతోషంగా తల పంకిస్తూ "మీరు బాగా పాడుతున్నారు. స్వరం బావుంది. మీరు పెద్దగా కష్టపడకుండానే ఈ కళలో ప్రావీణ్యాన్ని సంపాదించగలరు. రోజూ సాయంకాలం ఏడింటినుంచీ ఎనిమిదింటి వరకూ ప్రాక్టీస్ చేద్దురుగాని" అందామె.

"థాంక్యూ! వెళ్ళొస్తానండీ" అంటూ మరోసారి చేతులు జోడించి నమస్కరించి వెళ్ళబోతున్న కౌశిక్‌ని ఆపాదమస్తకం పరిశీలించింది ఊర్మిళ.


గ్రే కలర్ ప్యాంట్ మీద బ్రౌన్ కలర్ షర్ట్ టక్ చేశాడు. కర్లింగ్ క్రాఫ్ ఒత్తుగా, అందంగా వుంది. చేతికి రెండు గోల్డ్ రింగ్స్, మెళ్ళో మెరుస్తూన్న చైన్, ఎర్రటి పెదవి క్రింద చుబుకం మీద స్పష్టంగా కనిపిస్తూన్న పుట్టుమచ్చ, సన్నటి మీసకట్టు, హేండ్‌సమ్ పర్సనాలిటీ! అనుకోకుండా ఉండలేకపోయింది ఊర్మిళ. ఆమెలో ఏదో చిన్న భావ ప్రకంపన!

"కుర్రాడు బుద్ధిమంతుడులాగే వున్నాడు. పాటలు కూడా కమ్మగా పాడాడు. బ్యాంక్ ఆఫీసరైనా ఎంత వినయం, ఎంత విధేయత. ఎంత చక్కగా మాట్లాడాడు. పెళ్ళయిందో లేదో" ఊర్మిళ తల్లి దుర్గాంబ భర్త రాధాకృష్ణమూర్తితో అంది.

"దగ్గర దగ్గర ముప్పై ఏళ్ళుండవూ, ఇంకా కాకుండా ఎందుకుంటుంది. ఎవరో ఆ అదృష్టవంతురాలు!" అన్నారాయన క్రీగంట కూతుర్ని చూస్తూ.

'అవును; ఎవరో ఆ అదృష్టవంతురాలు!' అనుకుంటూ మూసిన పుస్తకం తెరిచింది ఊర్మిళ.

మూడున్నరకల్లా కాలేజీ నుంచి ఇంటికి వస్తుంది ఊర్మిళ. నాలుగు నుంచి ఐదుదాకా డాన్స్‌క్లాస్, ఐదు నుంచి ఆరుదాకా మ్యూజిక్ క్లాస్ ఉంటాయి. కౌశిక్ కోసం స్పెషల్ క్లాస్ అరేంజ్ చేసింది. రెగ్యులర్‌గా వచ్చి ఆమె చెప్పింది చెప్పినట్టు చక్కగా, అలవోకగా నేర్చుకుంటున్నాడు కౌశిక్. సెవెన్ టు ఎయిట్ తన క్లాస్ అయిపోయాక కూడా ఓ అరగంట, ముప్పావుగంట కూర్చుని ఏ లలిత గీతాలో పాడి విన్పిస్తుంటాడు. బ్యాంక్ విషయాలవీ చెబుతుంటాడు. అరమరికలు లేకుండా అన్ని విషయాలు మాట్లాడుతూండే కౌశిక్, కాలేజీలో చదువుకునే రోజుల్లో తననొక అమ్మాయి



చేస్తున్నాయి. విచిత్రమైన వేదనతో నిద్రపట్టక, పెరట్లో ఏ నన్నజాజి పందిరి క్రిందో కూర్చొని, వెండి చందమామతో దోబూచులాడుతూన్న తళతళలాడే తారలను పరిశీలిస్తూ ఏ భావగీతమో పరవశంగా పాడుకుంటోంది. అంతలోనే ఎవరో వెనుకగా వచ్చి కన్నులు మూసి, తల మీదుగా వంగి నుదిటిన చుంబించినట్లు అనిపించి సిగ్గుల మొగ్గై తనలో తనే ముడుచుకుపోతూంది! రెప్పపాటులో మాయమైన ఆ ప్రియుడి కోసం కలవరపాటుతో కలయచూస్తుంది. ఊరకే ఊహల్లో ఉలికులికి పడుతుంది. అలసిపోతుంది. ఆరాట పడుతుంది... 'ఎందుకో ఈ ఆరాటం మాకు తెలుసులే' అన్నట్టు తారా జాబిలి వెన్నెలలే నవ్వులుగా విరుస్తున్నాయి.

కనకాంబరం కలర్ కాటన్ శారీలో, తలనిండా కనకాంబరాల పూదండతో, కాటుక కన్నుల సోయగంతో అందరి దృష్టిని తనవైపు ప్రసరింప చేసుకుంటూ, రాయంచలా

ప్రేమిం
చిందనీ,
ఉద్యోగం వచ్చాక
తానామెను పెళ్లి చేసుకోవాలనుక న్నా
ననీ, అయితే ఈలోపు దురదృష్టః ాత్తూ ఆమె
ఓ యాక్సిడెంట్‌లో మరణించింద ) చెప్పినపుడు
'అయ్యో పాపం ఎంత దురదృష్ట ంతురాలు'
అనుకున్న ఊర్మిళ, అతనికింకా ె ళ్లి కాలేదన్న
సంగతి తెలిసి అప్రయత్నంగానే నం
దించింది! మగవాళ్ళలో అధిక శా ం
మంది తాగుబోతులు, తిరుగుబో ులు,
అహంకారులు, పెళ్లాలను వేధిం ుకు తినేవాళ్ళు అనే
అభిప్రాయం వున్న ఊర్మిళ ఇంః రకూ తన పెళ్లిపట్ల
ఉదాశీనంగానే వుండిపోయింది. ానీ ఇప్పుడు
అందం, హోదాలతోపాటు సకల ుణాభిరాముడిలా

కన్పి
స్తూన్న కౌశిక్
ఆమె మనసు
అద్దంలో నిలిచి, అనుక్షణం ఆమెను తన
గురించే ఆలోచింప చేస్తున్నాడు!
తీయని వెన్నెల రాత్రులలో కౌశిక్ తలపులు మధురోహలై ఆమె మదిని వింత వింత అనుభూతులకు లోను

తన సీటు దగ్గరికి నడిచి వస్తూన్న ఊర్మిళను అంత దూరం లోంచే చూసి ఆనందాంతరంగుడయ్యాడు కౌశిక్.

"గుడ్ మాణింగ్!" అంది అతని టేబిల్‌కెదురుగా వున్న ఛైర్‌లో కూర్చుంటూ. "గుడ్‌మార్నింగ్ టీచర్! ఇవ్వాళ కాలేజీ లేదా? ఏవిటిలా వచ్చారు?" రోజూకంటే ప్రత్యేకంగా కన్పిస్తూన్న ఆమె అందాన్ని, ఆ శోభని ద్విగుణీకృతం చేస్తూన్న అలంకరణని పరిశీలనగా చూస్తూ అడిగాడు కౌశిక్.

"కాలేజీకి సెకండ్ సాటర్‌డే హాలిడే. నా ఫైవ్ ఇయర్స్ డిపాజిట్ ఒకటి మొన్ననే మెచ్యూర్ అయింది. క్యాష్ తీసుకుపోదామని వచ్చాను. ఇదిగో డిపాజిట్ రిసీట్. ఇది ఎస్.బి.పాస్‌బుక్"

"అబ్బో... లక్ష రూపాయలైందిగా... వెరీగుడ్.

అన్నంరాజు వేణుగోపాల శ్రీనివాసమూర్తి

మంచి సేవింగ్ హేబిటే ఉందే మీకు!" ప్రశంసగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ అన్నాడతను.

చిరునవ్వుతో చూసిందామె.

"ఇంత డబ్బు తీసుకెడుతున్నారు. నాకేదన్నా పార్టీ ఇవ్వరా మరి?" లెడ్జర్ బుక్ చూస్తూ అన్నాడు కౌశిక్.

"అడగండి, మీకేం కావాలో" ఫ్యాన్ గాలికి ఎగిరి ముఖం మీద పడుతున్న అతని క్రాఫ్ వంక చూస్తూ అంది అభిమానంగా ఊర్మిళ.

"మీరేం అనుకోనంటే అడుగుతా" రిసీట్ వెనుక రెవెన్యూ స్టాంప్ అంటిస్తూ ఓరగా ఆమెవంక చూశాడు కౌశిక్. "అడగండి, ఫరవాలేదు... నేనేమీ అనుకోను" క్యూరియస్‌గా చూసింది ఊర్మిళ.

"సాయంకాలం నేను క్లాస్‌కి రాను. మీరు మా ఇంటికి రావాలి. అక్కణ్ణించి మనం ఏదైనా రెస్టారెంట్‌కి వెళ్ళి టిఫిన్, కాఫీ తీసుకుని ఓ మంచి పిక్చర్‌కి వెళదాం..."

చొరవగా అతనడిగిన తీరుకు చకితురాలైంది ఊర్మిళ. ఒక్కక్షణం ఆలోచించి "అలాగే చేద్దాం" అంది. ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బయ్యాడు కౌశిక్. అంత తొందరగా ఆమె అంగీకరిస్తుందని అనుకోలేదతను.

"థాంక్యూ టీచర్!" అన్నాడు ఉత్సాహంగా చూస్తూ.

"అయితే ఒక్క షరతు" అందామె.

చెప్పమన్నట్టు చూశాడతను.

"నాకంటే పెద్దవారు... నన్ను పేరు పెట్టి పిలిస్తే బావుంటుంది" సిగ్గుతో తలవంచుకుంటూ అందామె.

"అలాగే ట్రై చేస్తాను ఊర్మిళగారూ!" అంటూంటే అతనికా సంబోధనలోని కొత్తదనం కొంచెం ఇబ్బంది పెట్టింది.

పావుగంటలో వచ్చినపని పూర్తయింది. కౌశిక్ కూల్ డ్రింక్స్ తెప్పించాడు.

"ఈ డబ్బుతో ఏం చేయబోతున్నారు?" సిప్ చేస్తూ అడిగాడు.

"అమ్మా నాన్నకిస్తాను. వాళ్ళేదో గోల్డ్ కొనాలనుకుంటున్నారు"

"పెళ్ళి సందర్భంగానేమో" కుతూహలంగా చూస్తూ అన్నాడు.

"ఏమిటి మీరనేది?" సూటిగా చూస్తూ చిరుకోపంగా అంది.

"మీకేదన్నా మ్యాచ్ కుదిరిందేమోనని" చిన్నగా నసిగాడు కౌశిక్.

"అటువంటిదేం లేదులెండి. నేనొకతన్ని ప్రేమించాను..." మనసులో మాట ఇప్పుడే చెప్పడం మంచిదనిపించేసినా, అప్పటికి చెప్పే ధైర్యం లేక అంతమాత్రం చెప్పి ఊరుకుంది ఊర్మిళ. పైగా ఒకరిద్దరు బ్యాంక్ స్టాఫ్ తమనే గమనిస్తున్నట్లనిపించింది.

"ఎవరో ఆ లక్కీపర్సన్!" ఎర్రబడ్డ ఆమె చెక్కిళ్ళను తదేకంగా చూస్తూ అన్నాడతను.

"సాయంత్రం చెబుతాలెండి... మీరేమన్నా నా ప్రేమకు పెళ్లి ఏర్పాట్లు చేయగలరేమో చూస్తాను" అంటూ కొంటెగా చూసి లేచింది.

"కాసేపు కూర్చోండి" కళ్ళల్లో ఆమె రూపాన్నే నింపుకుంటూ అన్నాడతను.

"ఎందుకు... మీ వర్క్‌కి డిస్టబెన్స్... అతనెవరో సాయంత్రం తెలుసుకుందురుగానీ" కవ్వింతగా అని కదిలిపోయింది ఊర్మిళ.

ఆ సాయంత్రం మ్యూజిక్, డాన్స్ క్లాస్‌లకి సెలవిచ్చేసింది ఊర్మిళ.

ఇన్నాళ్ళూ అలంకరణపట్ల అశ్రద్ధ చేసిందేమో, ఇప్పుడు అలంకరించుకోవడానికి చాలా టైమ్ పడుతోందామెకు. "చక్కనమ్మ చిక్కినా అందమే! ఈమధ్య డైటింగ్ పేరుతో బాగా తగ్గిందమ్మాయి. అయినా చూడండి... కుందనపు బొమ్మలా ఎంతందంగా ఉందో. ఆ వయసులో నేనూ అలాగే వుండేదాన్ని మీకు గుర్తుందా?" దుర్గాంబ అంటూంటే రాధాకృష్ణమూర్తి గారు మీసం మెలేస్తూ "అది నా పోలికంటారే అందరూ... నవమన్మథుడినని, అతి సుందరుడిననే కదా నన్ను చూసిన వెంటనే ఒప్పేసుకున్నావ్ ఆనాడు... ఎవరికి తెలియదులే ఇంతుల సంగతి!" అంటూ పాటందుకున్నాడు.

"చాల్లేండి నంబడం, ఇంతకీ చూస్తున్నారో, లేదో ఇప్పటికి నాలుగు చీరలు మార్చింది. ఎన్నడూ లేంది ఆ సింగారింపు చూశారా? ఏదో అయిందండీ అమ్మాయికి" భర్త చెవి దగ్గరగా వచ్చి గునగునలాడింది దుర్గాంబ.

"అరె... ఏమయిందీ... ఒక మనసుకి రెక్కలొచ్చి ఎక్కడికో ఎగిరింది!" అని మళ్ళీ పాట ప్రారంభించారు రాధాకృష్ణమూర్తిగారు.

"ఉష్.. అమ్మాయి వింటే అరుస్తుంది ఆ సినిమా పాటలేవిటని. పాడితే ఏ త్యాగరాజు కీర్తనో, అన్నమాచార్య కృతో పాడండి" అందావిడ ముసి ముసిగా నవ్వుతూ.

"అమ్మా! నేనోపనిమీద బయటికి వెడుతున్నా. వచ్చాక విషయం చెప్తా. నా కోసం వెయిట్ చేయకుండా మీరు టైమ్ ప్రకారం భోజనం చేసేయండి" అని మూడు ముక్కల్లో చెప్పేసి వెళుతూన్న ఊర్మిళ వైపే విస్తుబోయి చూస్తూండిపోయింది దుర్గాంబ.

"అమ్మాయి వెళుతోంది అబ్బాయితో సినిమాకి. తను అతన్ని ప్రేమించానని చెప్పి, అతని అభిప్రాయం తెలుసుకుంటుంది. ఇంటికి వచ్చి, పెళ్లికి ముహూర్తం పెట్టించమంటుంది" అంటున్న భర్తవంక ఆశ్చర్యంగా చూస్తూ, "ఇదంతా మీకెలా తెలుసండీ, అయినా మన పిల్లేమిటండీ ఇలా తయారయింది?" కలవరంగా అడిగింది దుర్గాంబ.

"పిచ్చిదానా... కంగారుపడకు. కౌశిక్ ఎవరనుకున్నావ్. మా పినతల్లి కూతురు కలకత్తాలో ఉంటుందని చెప్పేవాణ్ణే... జ్ఞాపకం చేసుకో... దాని కొడుకే వీడు. ట్రాన్స్‌ఫరై ఇక్కడికి రాబోయే ముందు నాకు ఉత్తరం రాశాడు. మనమ్మాయి గురించి వివరిస్తూ నేనూ రాశానో ఉత్తరం. తరువాత సంగీతం నేర్చుకోవాలనే మిషతో కౌశిక్ మనింటికి రావడం, అమ్మాయితో సాన్నిహిత్యం, తన సత్ప్రవర్తనతో అమ్మాయిని ఆకట్టుకోవడం, ఇవ్వాళ్ళిద్దరూ కలిసి సినిమాకెళ్ళడం దాకా వచ్చింది వ్యవహారం! ఇక వచ్చే మాఘమాసంలోనే పెళ్ళి" అని చిద్విలాసంగా చూశాడు రాధాకృష్ణమూర్తి.

"అమ్మో... నాకు తెలీకుండా ఎంత నాటకం నడిపారండీ!" సంబరంగా చూస్తూ అంది దుర్గాంబ. అమ్మాయి వలచింది. కౌశిక్‌నేనని తెలియగానే ఆవిడ పరమానంద భరితురాలైంది.

"స్వేచ్ఛగా ఆలోచించడానికి అలవాటు పడ్డ ఊర్మిళ పెళ్ళి విషయంలో కూడా ఏదో ఒకనాడు ఇలాంటి స్వతంత్ర నిర్ణయం తీసుకుంటుందని నాకు తెలుసు. అయితే ఆ వచ్చేవాడు యోగ్యుడై వుంటాడని గ్యారంటీ ఏమిటి? అందుకే అన్నివిధాలా ఆలోచించి బుద్ధిమంతుడైన కౌశిక్‌ని ప్రోత్సహించాను. ఇన్నాళ్ళూ మగగాలికి దూరంగా వున్న అమ్మాయి దగ్గరగా వచ్చి మాట్లాడుతూన్న కౌశిక్ ఆకర్షణ శక్తికి ఇట్టే లోనైంది" నిశ్చింతగా నిట్టూర్పు విడుస్తూ అన్నాడు రాధాకృష్ణమూర్తి.

"మంచి సరసులే... ఏమైతేనేం ఇన్నాళ్టికి నా బంగారు తల్లికి కళ్యాణ ఘడియ వచ్చింది!" తృప్తిగా అంది దుర్గాంబ.

అదే క్షణంలో అక్కడ...

"ఐ లవ్ యూ కౌశిక్" అరమోడ్పు కన్నులతో చెప్పింది ఊర్మిళ.

"ఐ నో ఇట్... ఐ టూ లవ్ యూ..." అంటూ ఆమెను తన గాఢ పరిష్వంగంలో బంధించాడు కౌశిక్!

మనసు తెలిసిన మనసైన మగవాడి పొందులో సర్వాన్నీ మరిచి ఆమందానందంలో ఓలలాడుతోంది ఊర్మిళాంతరంగం!

*

